# వాడు

## కే ఎ స్వీ

వాడెలాంటివాడో తెలుసునాకు. తెలిసే వాడికో స్నేహం చేసేను. నేనెలాంటి వాణ్నో మొదట వాడికి తెలీదు. తెలుసుకుందామని వాడు నాతో స్నేహం చేసేడు ఆ సంగతి నాకు తెలుసు. మా ఇద్దరి మధ్యా స్నేహం నిలిచుండాలంటే నేను వాడికి పూర్తిగా ఎప్పుడూ అర్థమైపోకూడదు! మా ఇద్దరి సంగతేకాదు. అసలు స్నేహమంటేనే అది. ఇద్దర్లో కనీసం ఒక్కరైనా ఆ ఇంకొకరికి ఒక తరహా పజిల్‌గా వుండిపోవాలి. పజిల్ పజిల్‌గా వున్నంతకాలమే ఆసక్తి, పజిల్ సాల్వైపోతే? బస్! అంతవరకూ పజిల్ కనిపించే వైచిత్రి, ఒక తరహా గొప్పతనం-నశిస్తుంది. పజిల్‌ని సాల్వ్ చేసిన వాడు-పజిల్‌కంటే తనే గొప్పవాణ్ణని అనుకుంటాడు!

నేనొక పజిల్‌నని వాడికి తెలుసు. నేను వాడికి అర్థంకాను. అర్థంచేసుకోవాలని వాడు ప్రయత్నిస్తాడు. అర్థంకాకూడదని నేను ఏనాడో నిశ్చయించుకున్నాను. నేను వాడికి ఎన్నియుగాలకైనా అర్థంకాను. ఎన్ని యుగాలకైనా మా స్నేహం చెక్కు చెదరదు. నాతో స్నేహంచేసేప్పుడే ఈ సంగతి వాడికి తెలుసు. వాడికి తెలుసనీ నాకు తెలుసు.

నా హృదయం ఒక ఆటోమేటిక్ పరికరం. దాని తాళంచెవి దానిలోపలే వుంది. తలుపు మాత్రం నేనే మూసేను. తాళం బిగిసిపోయింది. వున్న ఒకేఒక్క తాళంచెవి లోపలే వుండిపోయింది. ఇహ దీన్ని ఎవ్వరూ తెరవలేరు తలుపులకేసి తలకాయలు బద్దలు కొట్టుకున్నాసరే-ఊహూఁ-ఈ తలుపులు తెరుచుకోవు.

నాతో స్నేహమంటే ఏమిటో వాడికి తెలుసు. అమాయకంగా గొర్రెలా వాడు నాతో స్నేహానికి సిద్ధపడ్డాడు.

అమాయకులంటే నాకు అసహ్యం. గొర్రెలంటే నాకు అసహ్యం, అందమైన గొర్రెలన్నా అసహ్యమే! అందమైన గాడిదలన్నా అసహ్యమే!

వాడో అందమైన గొర్రె. వాడో అందమైన గాడిద.

మరి వాడితో స్నేహానికి ఎందుకు సిద్ధపడ్డాను నేను?

సరే అందుక్కారణా లనేకం! కాని, కారణాలు-వున్నాయి!

నా అంతటి బుద్ధిమంతుడు, నా అంతటి మంచివాడు, నా అంతటి ఉదాత్తుడు, నా అంతటి రసహృదయుడు, నా అంతటి గొప్పవాడు-కారణం లేకుండా ఒక గొర్రెతో-ఒక గాడిదతో స్నేహం సాగిస్తాడా? అందంవుంటే వుండొచ్చుగాక-నిజానికి గొర్రెలంటే ఎంత అసహ్యమో, గాడిదలంటే ఎంత అసహ్యమో-అందం అంటే కూడా అంత అసహ్యంనాకు. చెప్పలేనంత అసహ్యం! ఆసంగతి ఎప్పుడూ గుర్తు వుంటూనే వుంటుంది నాకు!

లేదు, ప్రగల్భానికి-వుత్తి ప్రగల్భానికి చెప్పుకోవడం లేదు నేను, ప్రగల్భానికైతే-ఇంకా పెద్దమాటల్నే ఉపయోగించే వాణ్ని, బుద్ధిమంతుడు, మంచివాడు, ఉదాత్తుడు, రసహృదయుడు, గొప్పవాడు-ఈ మొదలైన విశేషణాలన్నీ నాకునేను తగిలించుకున్నవికావు. నా జీవితంలో ఏదోఒక సందర్భంలో ఎవరోఒకరు నిండుమనసుతో నాగురించి పలికిన మాటలే! వాళ్ళు అన్నారుకదా అని-నేను బుద్ధిమంతుణ్ణి-గొప్పవాణ్ణి...అయిపోలేదు. పుట్టుకతోనే నాలో ఈ గుణాలన్నీ వున్నాయి. ఎవ్వరూ కనిపెట్టి చెప్పకుండానే ఈ సత్యాన్ని నేను నా ఎరుకలో వుంచుకోగలను.

అయితే-ఇంత మంచివాడికి, ఇంత రసహృదయుడికి, ఇంత గొప్పవాడికి-ఆ అందమైన గాడిదతో స్నేహం చెయ్యాలని ఎందుకు కలిగింది వుద్దేశం??

ప్రపంచానికి కారణాలు కావాలి. ప్రతి చిన్న పనికీ పెద్ద కారణాలుండొచ్చు. ప్రతి పెద్దపనికీ చిన్నచిన్న కారణాలుండొచ్చు. చెప్పనవసరం లేకుండానే బయటపడిపోయేది. అందరికీ తెలిసినా ఎవరికీ తెలిపినట్టు కనిపించనివి, నిజానికి చెప్పుకోలేనివి. చెప్పుకోకూడనివి. సరే-కారణాలు-నేను చెప్పుకోకేం? నేనుచేసే ప్రతి

చిన్న పనివెనుకా పెద్దపెద్ద కారణాలు బోలెడుంటాయి. ఎందుకు చెయ్యాలి ఈపని? అని ఎవరైనా అడిగితే బహుశా నేను సమాధానం చెప్పను, కాని, నా కారణాలు తెలీకుండా నేను ఏపనీ చెయ్యను.

అప్పుడు చండప్రచండమైన ఎండాకాలం, వూళ్ళో ఎక్కడా మంచినీటి చుక్కలేదు. ఇదో కారణం.

అప్పుడు ఆంధ్రోద్యమం వచ్చింది: జై ఆంధ్రా. జై తెలంగాణా. ఇది రెండోకారణం.

పోలీసు కాల్పుల్లో దిక్కూమొక్కూలేకుండా జనంచచ్చిపోయేరు. మా వూళ్ళో ఫైరింగ్ జరగలేదు కాని సి. ఆర్. పి. దళాల తుపాకీల మ్రోత నా చెవుల్లో అనునిత్యం ప్రతిధ్వనిస్తూనే వుండేది. ఇది మూడో కారణం.

రక్తం రక్తం రక్తం నా కలల్లో చీకట్లో నల్లటి చీకట్లో రక్తం...ఇది ఇంకో కారణం.

రక్తం ఎవరిదో తెలీదు. కాల్పుల్లో బలైన అమాయకుడిదో? ఏమో!

నా మంచితనం, నా బుద్ధిమంతనం, నా రసహృదయం, నా గొప్పతనం...ఇవేవీ ఆ రక్తాన్ని ఆపలేవు. వేస్ట్! నా మనుకుని నేను గర్వించినవన్నీ వేస్ట్! నేను ప్రత్యేకంగా వుండిపోనవసరం లేదు. అందమైన గాడిదలతో నేను స్నేహం చెయ్యొచ్చు. అకారణ ద్వేషం గురించి, తుపాకీల మ్రోతగురించి, అమాయకుల మరణం గురించి, చీకట్లో నల్లటి చీకట్లో, రక్తం ఎర్రటి రక్తం గురించి—అన్నిటి గురించి మర్చిపోవచ్చు.

ద్వేషంకన్న, తుపాకీకన్న, మృత్యువుకన్న, చీకట్లో రక్తంకన్న—అందంతో స్నేహం, అందమైన గాడిదలతోనైతేనేం—స్నేహం...నయ మనుకున్నాను.

అందుకే—వాడితో చేసేను స్నేహం!

ఎవరూ నమ్మరు. ఎవ్వరితోనూ చెప్పలేదు నేను. వాడూ నమ్మడు. వాడితోనూ చెప్పలేదు నేను తెలిసే వాడిబోటి అల్పుడితో నాలాంటి ఉన్నతుడు స్నేహం చెయ్యడానికి కారణం ఇదే!

ప్రపంచ మహా సంగ్రామానికే కాదు—ప్రాంతీయ విభేదాలకి కూడా—ఫలితాలంటూ వుండనే వుంటాయి. ఏ చరిత్రకారుడికీ అందని ఫలితాలు. ఏ చరిత్రకారుడూ వూహించలేని ఫలితాలు!

పూర్తి నిజం చెప్పకపోయినా అబద్ధం చెప్పకుంటే చాలు! ఏం? నేను పూర్తి నిజాలూ చెప్తాను.

వాడితో నేను స్నేహం చెయ్యడానికి ఇల్లాంటివే ఎన్నో కారణాలు.

అందంగా వుంటాడు వాడని మొదటవాడికి తెలీదు. నాలోని గొప్పతనం దేశాన్ని ఏ రకంగానూ రక్షించలేనిదని వాడికి తెలీదు. ఏ పని చేసినా అన్నీ తెలిసి చేస్తుంటానని వాడికి తెలీదు.

—వాడికి తెలీని ఈ అన్నిటివల్లా వాడంటే నాకు ఇష్టం ఏర్పడింది.

ఇష్టం — నేనే ఏర్పరచుకున్నాను.

అయితే మా ఇద్దరికీ మొదట పరిచయం ఎలా ఏర్పడింది?

ఏమో - ఇప్పుడు గుర్తులేదు. ప్రయత్నిస్తే గుర్తు రావొచ్చు. కాని, ఆ అవసరం లేదు.

. వాడంటే ఇష్టం ఏర్పరచుకున్నాక, వాడిలో నేనంటే ఇష్టం కలిగించాలనుకున్నాను. కలిగించేసేను.

ఎలా?

అదే నా గొప్పతనం.

మోసం కాదు. కపటం లేదు. ఆశలు చూపడం లేదు. అబద్ధాలు చెప్పడం లేదు. అలాంటి హాస్యాస్పదమైన "చిటికెలు" ఏవీ ప్రయోగించలేదు.

కాని, అతణ్ణి జయించేన్నేను. అతణ్ణే కాదు. ఎవర్నయినా సరే అలాగే జయించగలను. ఆ రహస్యం ఏదో నాకు బాగా తెలుసు.

మనుష్యుల్ని జయించే రహస్యాలు తెలిసినవాళ్ళు కొంతమంది వుండొచ్చు. వాళ్ళందర్నీ జయించే యుక్తులు కూడా నాకు తెలుసు. అలాంటప్పుడు ఈ గాడ్రెని జయించడంఒక లెక్కా?

పడిపోయేడు.

గాడ్రె నా వల్లో పడిపోయేడు.

ఏం? స్వార్థమా? లేదే? అతడివల్ల నాకులాభంఅంటూ ఏమీ

లేదు అతడిస్నేహంవల్ల నాకుసంఘంలో పరపతిపెరగదు. నా ఆదాయం పెరగదు. నా పేరు ప్రతిష్ఠలు పెరగవు. పోనీ – నా మనసుకైనా ఏదైనా తృప్తి లభిస్తుందా అంటే – అదీ లేదు.

నిజానికి – గొర్రెతో స్నేహంవల్ల నేను చాలా నష్టపోతాను.

కాని, 'అన్నిటికీ సిద్ధపడ్డాను.

ఎందుకు ? – ఓహ్...మళ్లీ కారణాలు ..అనే కారణాలు...

"నువ్వెంతో మంచివాడివి ... నువ్వెంతో ఉత్తముడివి ... నీదెంతో మెత్తటి మనసు..."

అంటూ మొదలుపెట్టేడు వాడు.

నాకు తెలుసు వాడు ఆ మాటల్ని అప్పుడు హృదయపూర్వకంగానే అన్నాడు.

మొహమాటానికి ఇబ్బందిగా ముఖం పెట్టి ఆ మాటల్ని విన్నాను గాని, లోపల్లోపలే నవ్వుకున్నాను నేను.

ఫూల్ ! – అందమైన ఫూల్ ! నా అంచనా ప్రకారం నా వలలో కేవలం నేననుకున్నట్టుగానే పడిపోయేడు...

ఓ ! ... వర్ణించడం అంటే నాకు అసహ్యం ! నాకు నేను వర్ణించుకోవడమంటే కూడా అసహ్యం !

కాని, మా పరిచయం గాఢ స్నేహంగా పెనవేసుకుంటూన్న ఆ రోజుల్లో వాడి అందమైన ముఖంలో ఎంతో అమాయకత్వం కదలాడేది.

రోజూ వెళ్ళి నేను వాణ్ని కలుసుకునేవాణ్ణి.

సాయం తం సాయంత్రం వెళ్లే వాణ్ని.

నేను వెళ్ళేవేళకి సరిగా కిటికీనుంచి చూస్తూవుండి నేను వచ్చీరాగానే ముఖంలో ఆనందరేఖలు చిమ్ముతుండగా – 'వొచ్చేవా !" అనేవాడు వాడు.

వాడేం మాట్టేడోవాడో వాడికి తెలీదు. వాడే, మాట్లాడబోయి వేరే ఏం మాట్లాడేవాడో నాకు తెలుసు. వాణ్ని గురించి వాడికీ తెలీని రహస్యాల్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిశోధిస్తూ వుండే వాణ్ణి !

"వొచ్చేవా !" అని నేను రాగానే అనేవాడు వాడు.

ఆ మాట నాకోసం అనాలి ఎవరో వొకరనాలి రోజూ అనాలి, నాకోసం రోజంతా ఎదురు చూసినట్టు, వాళ్ళ నిరీక్షణను తరింప జేస్తూ నేను ప్రత్యక్షమైనట్టు – "వచ్చేవా !..." అమాట ... అమాటే... కావాలి నాకు.

రోజుకోసారైనా అమాట వినకపోతే బ్రతకలేను.

స్నేహరాక్షసుణ్ని నేను.

పాపం, వాడికిది తెలీదు·

సాయం తం ముగిసి, దీపాలు వెలిగి, చెట్లు గుసగుసగా నీడల సైగలతో పూలనిట్టూర్పులతో మాటాడుకునే వేళ, అయితే వెళ్తాను –" అంటూ వాడినుంచి శెలవు తీసుకునేవాణ్ణి. నేను నిష్క్రమించబోతుండగా –

"మళ్ళీ ఎప్పుడు ?–" అనేవాడు.

ఆ మాట – అమాటే –

నా కోసమే తను బతుకుతున్నట్టు – నన్ను కలుసుకోవడంలోనే తన జీవిత పరమావధి వున్నట్టు – ఎన్నిసార్లు నాతో కాలం గడిపినా తనివి తీరనట్టు – "మళ్ళీ ఎప్పుడు ?–"

రాక్షసుణ్ని – స్నేహరాక్షసుణ్ణి నేను !

ఏమీ తెలీదు వాడికి, గొర్రె, గాడిద

స్నేహమనే కల్లు తాగించేను వాడిచేత.

నాక్కావలసినమాటలు వాడినోటంట పలికించుకున్నాను –

"వచ్చేవా ?–" "మళ్ళీ ఎప్పుడు ?-"

ఆ మాటల విలువ - వినే నాకు తెలుసుగాని – మాట్లాడే వాడికి తెలీదు !

సరే – వాడు పూర్తిగా నావశం అయిపోయేడు !

మందూ మాకూ లేదు. మం తం తం తం లేదు.

మనసుందిరా నా దగ్గర – అని మౌనంగా సైగచేసేను.

పేరాశతో వొచ్చేడు. కూరుకుపోయేడు.

"మాట్లాడు - ఏదైనా మాట్లాడు..."

అని నన్నుతొందరచేసేవాడు.

వాడికోసం ఏదైనా వొకటి మాట్లాడాలి నేను.

"ఏం మాటాడను ?–"

"ఏమైనా సరే ! ..."

"ఏమైనా సరే – అంటే ! ?–"

"ఏమైనా సరే - మాట్లాడు...ప్లీజ్ !.."

"ఏమిటో అంత అవసరం ?–"

"నువ్వు మాట్లాడుతుంటే వినాలనుంది –"

"విడ్డూరం నా మాటల్లో ఏముంది ?–"

"ఏమో – తెలీదు – నీగొంతులో సంగీతం వుంది. నాకర్థం కాదు. కాని వినాలనుంది. మాట్లాడు, నీకిష్టమైంది మాట్లాడు. ఏమీ తోచకపోతే – నన్ను తిట్టు ... ప్లీజ్ !... నన్ను తిట్టు –"

లోపల్లోపలే నవ్వుకునేవాణ్ణి.

నానాటికి నాశక్తి నాకే తెలిసి వచ్చింది.

మగవాళ్ళు మగవాళ్ళను ప్రేమించడం సాధ్యమా ? మగవాళ్ళు మగవాళ్ళచేత ప్రేమింపజేసుకోవడం శక్యమా ?–

సాధ్యమే ! శక్యమే !

నావంటి గొప్పవాడికి అసాధ్యంలేదు. అశక్యంలేదు.

"వొద్దు. చూడు. నాలో ప్రత్యేకతేమీలేదు. నామీద ఇంత ఇష్టం పెంచుకోవొద్దు. తరువాత కష్టపడతావు –" అనేవాణ్ణి,

అన్నానని అనడం వేరు.

ఆ మాటల్ని నా అద్భుతమైన గొంతుతో హృదయాన్నీ ఆత్మావేశాన్నీ రంగరిస్తూ పలకడం వేరు.

వూహూఁ– నటించలేదు నేను.

నటన చాతనౌను. కాని నటించలేదు. అవసరంలేదు. అవసరమున్నా నేను నటించను.

నటించని నటుణ్ణి !

– అట్లా నేను మాట్లాడితే మరీ కరిగిపోయ్యేవాడు వాడు.

"ఎందు కిట్లా అబద్ధాలు చెప్తావు,? మొహమాటానికీ హద్దులున్నాయి. నువ్వు అందరిలాంటి వాడివి కావు. నువ్వొక ప్రత్యేకమైన మనిషివి. అందరికంటె మంచివాడివి..."

"నా చెడ్డ ఎవరికి తెలుసు ? –"

"నీలో చెడ్డ లేదని నాకు తెలుసు–"

"ఎట్లా తెలుసు ? – ఋజువు ?"

"ఋజువులేకుండా నమ్ముతాను..."

అలాగే నమ్మేడు నన్ను.

నేనో హామ్లెట్‌ని. రాస్కోల్నికోవ్‌ని, జాన్ క్రిస్టోఫీని, సుబ్ర

మణ్యం నవలలో రాముణ్ని, దయానిధిని అలజీవి సుబ్బయ్యని. నేనే కృష్ణపక్షాన్ని. కిన్నెరసాని జాలిని.

ఓహ్ ! ఎంత కవిత్వం ! ఎంత కవిత్వం !!

నా జీవితం ఒక గొప్ప పద్యం !

ఎంతో కవిత్వం మాట్లాడేను వాడితో నేను, వాడితో మాట్లాడే మిషమీద నాతో నేను మాట్లాడుకున్నాను.

వాడుట్టి శ్రోతగా ప్రేక్షకుడుగా వుంటూ – తనని తాను మరిచిపోయేడు.

నా కవిత్వంతో నా హృదయంతో చిత్తశుద్ధితో నా జీవిత విషాదంతో – వాణ్ణి కొల్లగొట్టేసేన్నేను.

నామటుకు నేనుమాత్రం ఏమీ యెరుగనివాణ్ణాగా వుండిపోయేను.

ఏం ? ఏముంది చెప్పుకోవడానికి ? ... ...

నాతో నేను చెప్పుకోడానికి మాత్రం?......

అవును, వాడు అందమైనవాడు. చాలా అందమైనవాడు.

అందమైనవాళ్ళంటే అసహ్యం నాకు.

కాని, వాడి అందాన్ని క్షమించేసేన్నేను. పట్టించుకోలేదు.

ఎర్రగా వుండేవాడు. సన్నగా వున్నా ఆరోగ్యంగా వుండేవాడు. కోల ముఖం, తేట కళ్ళు. గీసిన ముక్కు, కత్తిరించిపెట్టిన పెదవులు, వొంపున్న గెడ్డం, నుదుటిమీదికొచ్చిపడే జుత్తు –

వూఁహూ – వర్ణన నాకు చాతకాదు.

కాని వాడు అందమైనవాడే !

తెల్లటి వాడి కళ్ళలో ఎంతో అమాయకత్వం ఉత్సాహం క్యూరియాసిటీ వుండేవి !

ఓహో ! ఇలా వుంటుందా ప్రపంచం అంటే ? నే నింకా ఏమో అనుకున్నాను – అంటున్నట్లుండేవి ఆ చూపులు.

ఏ మనిషిని వర్ణించాల్సివచ్చినా ప్రత్యేకంగా అతడి కళ్ళని వర్ణిస్తారు కవులూ రచయితలూ, మనుషుల్ని చిత్రిస్తే – చిత్రించదలచిన మనిషి స్వభావాన్ని కళ్ళలో నిక్షేపించాలని ప్రయత్నిస్తారు చిత్రకారులు.

మనిషి వ్యక్తిత్వం అంతా అతడికళ్ళలో బైటపడుతుందని నాకు తెలుసు

వాడి కళ్ళలోంచి బైటపడే వాడి వ్యక్తిత్వం చూసి సన్నగా నవ్వుకునేవాణ్ణి.

అది చాలా అందమైన వ్యక్తిత్వం అయితే అందులో లోతు లేదు అందులో శక్తిలేదు. ఆ అందం జ్ఞానంవల్ల వచ్చే 'సౌందర్యం' కాదు అది వయసు తెచ్చే పైపై అందం.

సిన్సియర్‌గా ఆలోచించడం నా ప్రత్యేకత

ఔను వాడికళ్ళు నాకు ఖచ్చితంగా గాడిదకళ్ళనే గుర్తు తెచ్చేవి

ఏమీతెలీదు ఏమీ తెలీదువాడికి అమాయకుడు అర్భకుడు అందమైనవాడే – అంటే – అందంగా ఇతరులకి కనిపించేవాడే – కాని అందం అంటే ఏమిటో కూడా తెలీనివాడు.

నువ్వు సాధ్యమైనంత వికారంగా వుండు కాని కొంచెం నీ సొంతతెలివి కనబర్చు – నువ్వంటే నేనిష్టపడతాను...అని వాడికి చెప్పలేదు నేను.

ఎందుకంటే వాడికి సొంత తెలివంటే తెలీదు!

వాడికంటే నేను అందంగా ఎవ్వరికీ కనిపించేవాణ్ణి కాను – వొక్క వాడికి తప్ప!...ట

"నన్ను చేసుకునే ఆడపిల్ల ఎవరోగాని – ఎంత అదృష్టవంతురాలు!..." అనేవాడు ఎన్నోసార్లు.

ఛీ! – నేనెంత వికారంగా వుంటాను!–" అనేవాణ్ణి!

"ఎవరంటారలా? ఇలా రమ్మను నేను చెప్తాను ... నీకేం? అచ్చు మొగాడిలా వుంటావు –"

నేను హ్హ – మేన్ననే సంగతి (?) వాడునాకు జ్ఞాపకం చెయ్యనవసరం అంటే లేకపోయినా – వాడినోటంట ఆ మాట చెప్పించుకుని నవ్వుకునేవాణ్ణి!

వాడి అందం అంటే నాకు అసహ్యం! నిర్లక్ష్యం!!

నా వికారం అంటేనే వాడికి ఇష్టం!

"జీవితంలో వుండే సౌందర్యాల్లో మనస్నేహం వొకటేమె!..." అనేవాణ్ణి వాడితో!

అటువంటి మాటలు నా నోటంట వినలేకపోయేవాడు.

"అలా అనకు. నా జీవితంలో మరపు రాని ఘట్టం – నీతో పరిచయం నీ పరిచయంవల్ల నా మనసుకి ఆసరా దొరికింది. ఎంత అదృష్టవంతుణ్ణి నేను! నా అదృష్టానికి వొక్కోసారి నాకే ఈర్ష్య కలుగుతుంది ... ఇంతటి అదృష్టానికి పూర్వజన్మలో నేనెంత పుణ్యం చేసుకుని వుండాలో అనేవాడు–"

వాడలా మాట్లాడేకొద్దీ నేను వాణ్ణి మరీ రీ వూరించేవాణ్ణి. వొక్కోసారి కావాలనే వాడి దగ్గరికి వెళ్ళడం మానేసేవాణ్ణి. మరుసటి దినం వెళ్ళేసరికి వాడు కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయేవాడు –

"వచ్చేవా? ఈ వాళ కూడా వొస్తావో రావో అనుకున్నాను– ఏం – నిన్నంతా రాలేదేం? సాయంత్రమంతా ఎదురుచూసేను. నువ్వు రాకుండానే సాయంత్రం రాత్రయిపోయింది ఏదో అవసరమైన పనుండి రావడం మానేసేవనుకున్నాను అయినా ఏమో – వొస్తావేమో అని అర్ధరాత్రి దాకా ఎదురుచూస్తూనే వున్నాను ... ఏం? ఎందుకు రాలేదు నిన్న?–"

లోపలే నవ్వుకునేవాణ్ణి.

రాకపోయినందుకు అబద్ధాలూ కుంటిసాకులూ చెప్పేవాణ్ణి కాదు.

"రోజూ వస్తే ఇష్టం నీ వదులెదూ" అనేవాణ్ణి.

"ఆ మాట అనకు కావలిస్తే – నీకోసం నేను చచ్చిపోతాను – నీమీద ఇష్టం పోతే ఇహ నేను బ్రతక నవసరంలేదు–" అనేవాడు, ఆ బేలకళ్ళతో చూస్తూ

వుట్టి మూర్ఖుడి కళ్ళు లోతులేని కళ్ళు.

బలపరుపు కళ్ళు, బలపరుపు చూపులు.

వొక్కోసారి వూరెళ్ళి అతను రాసే వుత్తరాలు వింతవింతగా వుండి నాకు విపరీతంగా నవ్వు తెప్పించేది ... ...

"... ... నీతో పరిచయానికి పూర్వజన్మలో ఎంత పుణ్యం చేసుకుని వుండాలో అనుకున్నాను ఇన్నాళ్ళూ. ఇలాంటి పరిచయానికైతే పుణ్యం కాదు పాపం చేసుకుని వుంటాననిపిస్తోందిప్పుడు...

ఏం? నేనో ఆడపిల్లనైగా ఎందుకు ఘట కూడదూ?

చుక్కలు నిండిన ఆకాశం కింద ఇసుకలో కూచుని వి వా ...

తలపెట్టుకుని — గంభీరంగా నువ్వు మాట్లాడుతుండగా వింటూ వుండడానికి — ఏ ఆడపిల్ల ఎంత పుణ్యం చేసుకుందో!

ఆ ఆడపిల్లని నేనే ఎందుక్కాకూడదూ? ఎంత దురదృష్టవంతుణ్ణి నేను! ఎంత దురదృష్టవంతుణి !!

పెళ్ళి చేసుకోవద్దని నిన్ను అడగలేదు. అడగను. ప్రకృతి విరుద్ధమైన కోరిక నేనుమాత్రం ఎలా కోరుకోను! నేను ఆడపిల్లగా పుట్టకపోయిన నా దురదృష్టానికి మాత్రం నేను ఖేదించని క్షణం లేదు.

"అంతా నీకోసమే! నీ కోసమే! ......"

హోమోసెక్సువల్స్ అని భ్రమపడేదాకా వృద్ధిచెందింది మా స్నేహం.

నాకోసం వాడు పిచ్చివాడైపోయేడు. తన సమస్యలన్నీ నాతోనే చర్చించేవాడు. నేను చెప్తేనే ఏదైనా చేసేవాడు. నాకేమాత్రం ఇష్టంలేదని తెలిసినా - మానేసేవాడు.

ఒకవంక నాకు విసుగెత్తడం ప్రారంభమైంది. పూఁహుఁ — నా సరదాకి — నాకాలం కొంచెం వినోదాత్మకంగా గడిచేందుకు — ఈ హృదయనాటకం మొదలుపెట్టేను.

మొదలైన ప్రతిదీ ఎప్పుడో ఒకప్పుడు ఆఖరవక తప్పదు. తెరవాలక తప్పదు. కథ ముగియక తప్పదు.

కాని, ఆరంభమైతే నా చేతుల్లో వుంది. ముగింపు వాడి చేతుల్లోనే! ఎప్పుడు ముగించాలో తెలుసు. అయినా, వాడిచేత ముగింప జేసుకోవడంలో కదూ వుంది నా పజ్జ్ఞ!

అసహ్యం! అసహ్యం! వాడంటే ఒకవంక అసహ్యం నాలో రోజురోజుకి పెరిగిపోతోంది. వాడి అమాయకత్వాన్ని వాడి అజ్ఞానాన్ని భరించలేకపోతున్నాను. నేనేదైనా చెప్తున్నప్పుడు నోరు కొంచెంగా తెరుచుకుని వినేవాడి భంగిమ నాలో అసహనాన్ని రేపుతోంది.

"మూర్ఖుడా! లే!— వెళ్ళిపో! పారిపో!— నువ్వు దద్దమ్మవి —" అని గట్టిగా అరిచి చెప్పాలనిపించింది.

అతిప్రయత్నంమీద నన్ను నేను అదుపులో పెట్టుకుంటు

న్నాను.

వాణ్ణి తప్పించుకు తిరగాలని ఎన్నో ప్రయత్నాలు చేసేను. గమనించలేదువాడు. వెంటబడేవాడు. "ఏమిటలావున్నావ్? చెప్పవూ? నాకు చెప్పవూ?—" అంటూ ఆరాలు తీసేవాడు. వాడికి అందకుండా సమాధానాలు చెప్పి తప్పించుకునేవాణ్ణి!

వాడు నా గురించి యాతనలు అనుభవిస్తూండగా — "పోనీలే — విసుగెత్తి వాడు నన్ను కలుసుకోవడం మానేస్తాడు—" అనుకునేవాణ్ణి. నా అంచనా తప్పవుతుందనీ నాకు తెలుసు.

సజిల్ అర్థంకాక పోయేసరికి వాడిలో ఆసక్తి మరీ అధికం అయిందేగాని, తగ్గలేదు. "ఏమిటీ మనిషి "ఏమిటీ మనిషి!" అని నా గురించి బుర్రబద్దలు కొట్టుకునేవాడు.

ఎంత బుద్ధిమంతుడికైనా ఎంతటి తెలివైనవాడికైనా ఎంతటి గొప్పవాడికైనా— ఒక్కోసారి స్ఖాలిత్యాలు తప్పవంటారు. నిజమే కాబోలు!

వాణ్ణి ఫూల్ చేస్తున్నాననుకున్నాను. ఒకవంక నేనూ ఫూల్ ఔతూనే వున్నాను.

అయితే — నాకు తెలిసే నేను ఫూలయ్యాను గాని, తెలీకుండా కాదు.

నన్ను నేనే ఫూల్ చేసుకున్నాను. అదే నాకు ఇష్టం అనిపించింది. అందులో కూడా ఏదో ఆనందం కనుపించింది.

జీవితంలో నష్టపోయేను. అయినవాళ్ళని వదులుకున్నాను. మనస్సైన వాళ్ళను కించపరిచేను. నా భవిష్యత్తుతో నేనే వింత వింత ప్రయోగాలు చేసుకున్నాను.

లాభనష్టాలు బేరీజు వెయ్యడానికి జీవితం వ్యాపారం కాదు— అని నాకు నేనే సర్దిచెప్పుకున్నాను.

వ్యక్తిగతంగా నేను నష్టపోయిన వీటన్నిటికి కారణం వాడెలా ఔతాడు? కాదు!

నేను గొప్పవాణ్ణి!

నష్టపోదలచుకుంటాను, నష్టపోతాను. అంతా నా చేతుల్లో వుంది.

ఈ మాటే వాడితో అంటే నొప్పకునేవాడుకాదు.

"లేదు — నువ్విలా అయిపోకూడదు—నువ్వు బాగుపడాలి—" అనేవాడు.

ఇక్కణ్ణుంచి ఏం జరుగుతుందో నాకు తెలిసిపోయింది. నేను బాగుపడాల్సిన సంగతి వాడు గుర్తుచేస్తున్నాడు. వాడి పజిల్‌ని నేను. నేనెలా వుండాలో వాడు నిర్ణయించడం ఏమిటి ?

ఇహ — వాడి సంగతి —

వాడి సంగతికేం ?

దివ్యంగా సాగిపోనారంభించింది. పరీక్షలు పాసయ్యేడు. జీవితంలో బాగుపడ్డాడు. నలుగుర్లోను మంచిపేరొచ్చింది. ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు అతణ్ణి పెళ్ళిచేసుకోవడానికి ఇష్టపడుతున్నట్టు చూచాయగా తెలిసొచ్చింది. అంత కట్నం ఇస్తాం, ఇంత కట్నం ఇస్తాం అంటూ వాళ్ల బంధువుల్లోంచి సమ్మంధాలు రాసాగిన్నై.

అంతే !

వారం రోజుల్లో వాడు మారిపోయేడు.

నేనేదో పనిమీద రాష్ట్రాంతరం వెళ్ళేను.

తిరిగొచ్చి అలవాటుగా వాణ్ణి కలుసుకునేందుకు వెళ్ళేసరికి ఓహ్!— అతఃలో చెప్పలేనంత మార్పు కనిపించింది.

ఘోరమైన మార్పు, విచిత్రమైన భయంకరమైన మార్పు—కొట్టొచ్చినట్టు కరవొచ్చినట్టు కనిపిస్తోంది !

"ఓ !-నువా! కమాన్!రా!రా!-" అని నన్ను ఆహ్వానించేడు. "బాగున్నావా ?—" అంటూ కుశలప్రశ్నలు వేసేడు.

బస్ !

తెలిసిపోయింది. వాడికీ నాకూ మధ్య ఏర్పడిన అగాధం నాకు వెంటనే స్ఫురించింది.

"వచ్చేవా !"- అనేవాడు మునుపు. ఆ అమాయకత్వం లేదిప్పుడు. ఆ దయ, ఆ నిరీక్షణ, ఆ ఆత్మీయత— అన్నీ నశించిపోయేయి. లోకజ్ఞుడిలాగా వ్యవహరిస్తున్నాడు. బాగానేవుంది. కాని, వాదగ్గరా వాడి లోకజ్ఞత! ?

అంతటితో ఆగిపోలేదు. వాడు నాకు తెక్చెర్లివ్వడం మొదలుపెట్టేడు. హాస్యాలాడడం మొదలుపెట్టేడు. నీతులు చెప్పడం, సలహాలివ్వడం మొదలుపెట్టేడు. ఇవన్నీ వాడెందుకు చెయ్యకూడదూ ? చెయ్యొచ్చు! వాడెందుకు ఎదగ కూడదూ? ఎదగొచ్చు! కాని—అది ఎదుగుదలకాదు—నిజమైన ఎదుగుదల కానేకాదు. "నేను ఎదిగేను. నీలా ఎదిగేను. నీకన్నా ఎదిగేను. నేను నీ అంతటివాణ్ణో కాను. నీకంటే ఎక్కువ వాణ్ణి—" అని చెప్పుకోవాలని లోలోపట్నుంచి ఆరాటం. అవును, అర్భకుడు—నిజంగా ఎదగలేదు వాడు. ఎదిగితే అలా ఆరాటపడిపోవాల్సిన అవసరం లేదు. ఆరాట పడడంలో తన అల్పత్వాన్ని తానే బైట పెట్టుకున్నాడు.

సరే పోనీ అనుకున్నాను మొదట. పట్టించుకోలేదు. పట్టించుకోకపోవడం నాకు అలవాటే. ఎప్పట్లామా తం వాడిని కలుస్తూ వుండేవాణ్ణి.

పరిస్థితి అలాగే కొనసాగివుంటే పాపం-గొ(రె— బాగుండేవాడు: కాని, చెరుపుకున్నాడు. వూరుకుని వుండాలి నవాడు వూరుకోలేదు. చెలరేగేడు. అందరికీ వాడో పెద్ద. వాడోగొప్ప. అందరూ వాణ్ణి అంత వాడింతవాడంటారు. దాంతో వాడికి కళ్ళు కనిపించడం చెవులు వినిపించడం మానేసేయి. వాణ్ణి నేను పొగడలేదు. "ఓహో! ఎన్ని సాధించేవు నువ్వు!" అనలేదు. ఎందుకనలేదు ? నిజానికి వాడు ఏమీ సాధించలేదు గనక! కాని, వాడిది గుర్తించలేదు. ఎందుకు గుర్తిస్తాడూ ? గొ(రె—గాడిద—ఎలా గుర్తిస్తుంది ??

నా గుర్తింపు కావాలి వాడికి! ఆసంగతి నాకు తెలిసింది.

నలుగుర్తోపాటు నేనూ వాణ్ణి—',ఓహో !—నువ్వెంత గొప్పవాడివి" అనాలి !—అందుకోసం వాడు పడే తహతహ అర్థమైంది.

బిగిసి కూచున్నాన్నేను. నాతో మునుపటిలా మాట్లాడలేక; మాట్లాడకుండా వుండలేక—లోపల్లోపలే గిలగిల్లాడిపోయేడు వాడు.

వాడు గిలగిల్లాడిపోవడం చూచి నేను అంతరాంతరాల్లో ఎంతో సంతోషించే వాణ్ణి!!

రావణాసురుడి లాంటి వాణ్ణినేను. రాక్షసుణ్ణి. స్నేహ రాక్షసుణ్ణి.

వొకప్పుడు నాకోసం ప్రాణం ఇస్తానన్నాడు వాడు. వాడి ముందిప్పుడు నేను చులకనైపోయేను. ఎలా సహించగలను దీన్ని ?

సహించలేను !

"వాదు. నీ మంచికి చెప్తున్నాను—నా మనసుతో ఆడుకో వద్దు"—అని వాడికి రెండుమూడు ఉత్తరాలు రాసేను.

ఉత్తరాలు అందుకున్న రెండుమూడు రోజులు మాత్రం కొంచెం మామూలుగా ప్రవర్తించేవాడు.

కాని, తరువాత మళ్ళీ చెలరేగిపోయేవాడు.

ముఖ్యం—నాలుగురైదుగురు స్నేహితుల మధ్య వున్నప్పుడు—నన్ను—ఏదో రకంగా కించపరచాలని చూసేవాడు.

మాటల్తో కొట్టాలనుకునేవాడు.

"చూడు—ఆ ముఖంకేసిచూడు—ఎంత శుభ్రంగా వుందో!—" అని నాగురించి నీచంగా మాట్లాడేవాడు, "నువ్వు—నాకన్నా తెలివైన వాడివా?—" అని, సరదాగా అంటున్నట్టే అనేవాడు— "ఏం? ఎందుకు?—నువ్వేం ఆకాశం నుంచి వూడిపడ్డావా?—" అని మాట వరసకి—పంతానికి అంటున్నట్టుగా అనేవాడు.

కాని, ఆమాటల అసలుధ్వని అందిందినాకు, అమాయకుడు. పిరికివాడు. నాతో నేరుగా అనే ధైర్యంలేదు. నలుగుర్లోవున్నప్పుడే ధైర్యం. పాపం, అనకూడదని అనుకుంటాడు. అనకుండా వుండనూలేడు. బైటపడిపోతాడు గ్రారె, గాడిద బుద్ధి బైటపడి పోతుంది.

వాడా మాటలు అంటూండగా నా పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకు పోయేవి. నా గుండెలు అతివేగంగా కొట్టుకునేవి. నాలో రోషం బుసలు కొట్టేది.

"బుద్ధిహీనుడా! మాటాడకు! ఈవాళ నీ బ్రతుకు—వొకప్పుడు నేను నీకు పెట్టిన భిక్షం! నాకు నేను గౌణకుంటూండగా విని—మాట్లాడ్డమంటే ఏమిటో తెలుసుకున్నావు నువ్వు షటప్!— యూ ఫూల్!—" అని అరవాలనిపించేది.

ఆవేశాన్ని అదుపులో పెట్టుకునేవాణ్ని.

అతి ప్రయత్నంమీద, అతి ప్రయాసమీద.

వాడితో కలవడం నా అంతకు నేను మానుకోవాలి. కాని, వూహూ అది వోటమి అవుతుంది. వాడిలోనేను భీరువును కాను.

కానీ. ఈ పోరాటం ఎంతకాలం సాగుతుందో— అనుకున్నాను. అన్నటికీ సిద్ధంగా వున్నాన్నేను. ఔను, అదే ఔన్నత్యం!!

నా మనసులో జరుగుతున్నదంతా వాడికి ఎప్పటి కప్పుడు తెలుస్తూనే వుంటుందనీ, తెలిసి తెలిసీ వాడు నా మనసుమీద దెబ్బ కొటడానికి ప్రయత్నిస్తున్నాడనీ, లేని ఆధిక్యతను నిరూపించుకో జూస్తున్నాడనీ తేట తెల్లంగా తెలిసినా—మునుపట్లాగే మసులుతూ వున్నానేను వాడితో.

వొంటరిగా వున్నప్పుడు మాత్రం నాతో మామూలుగా—మును పటి లాగానే వుండేవాడు. మునుపటిలా నన్ను మాటాడమనేవాడు కాదు. నేను మాట్లాడితే ప్రత్యేక శ్రద్ధ కనబర్చేవాడు కాదు, మెదలకుండా వినేవాడు. అంతే!

ఆ మౌనం నన్ను మరీ మరీ బాధించ సాగింది.

నవ్వుతున్నాడు. లోపల నవ్వుతున్నాడు వాడని తెలిసిపోయింది. "మునుపు నేను వాణ్ణి చూసి వాడికి తెలీకుండా లోపలే నవ్వుకునేవాణ్ణి!

ఇప్పుడు వాడు నన్నుచూసి లోపల నవ్వుకుంటున్న నవ్వు నాకు సుళువుగా తెలిసిపోతోంది.

ఒకసారెందుకో — నాకో వింత బుద్ధి కలిగింది. యథాలాపంగా మాటల సందర్భంలో — "—ఏమైనా నువ్విప్పుడు పెద్ద వాడివికదా!—" అన్నాను!

స్సామ్రాజ్యాలు జయించినంత గర్వం వాడిముఖంలో మెరిసింది. ఎంతదాచినా దాగకుండా నవ్వటినవ్వు వాడిపెదవులమీద పాకింది!

తెలివి కళ్లతో ఇదంతా గమనించేను నేను, పైకి మామూలుగా వున్నాను.

"అరె — నేనేం పెద్దవాణ్ణి!—" అన్నాడు వాడు మొహమాటానికి, అంటూ నాకేసి వోరగా చూసేడు.

కళ్ళు తిరిగిపోయేయి నాకు.

భయంకరం! ఘోరం! క్రూరం! క్రూరం!

అతని కళ్ళు — మారిపోయేయి!

విచి త్రంగా — నమ్మలేనంతగా — అసహ్యాకరంగా — జుగుప్స కలిగిస్తున్నాయి —

అ గ్రారేకళ్ళు — ఆ లోతులేని గాఢిదకళ్ళు — ఎంతగా మారి పోయేయి !!

గమనించనేలేదు నేనంతకు ముందెప్పుడూ ?

తెల్లగా కనుగుడ్లు — నల్లగా అమాయకంగా కనుపాపలు — వొకప్పుడలా వుండేవి —

ఇప్పుడు —

దారుణం ! దారుణం ! దారుణం !!

వోరగా చూసిన ఆ కనుగుడ్లలో తెలుపు — విరిగిన పాలలా వుంది.

ఆ కనుపాపలో అమాయకత్వంలేదు. దానిస్థానంలో —ఏదో— పచ్చగా — ఎర్రజీరలుగా — విషపుకాతాలు కాచేచెట్టు కొమ్మల పచ్చదనంలాగా —

ఏమిటది — ఏమిటది —

వొక్కసారిగా వొణికిపోయేన్నేను — తెలిసిపోయింది నాకు —

విషం! ఆ కళ్ళలో నిండింది — విషం !

పచ్చి విషం !

నా వొళ్ళంతా తేళ్ళు జెర్రులూ నాకలల్లో చీకట్లో ముళ్ళూ రాళ్ళూ —

కళ్ళుకాదు — వాటిపేరు కుళ్ళు !!...

అలా కలలుగంటూ కలల్లో కుళ్ళులో యుద్ధం చెయ్యలేక అలిసిపోతూ వున్నా నాఅంతరంగంలోకి ఎలా వొచ్చిందో — ఎప్పుడొచ్చిందో — వొకకోరిక అతి రహస్యంగా వొచ్చి బలంగా తిష్ఠ వేసింది.

నా ప్రమేయంలేదు నా సంకల్పంలేదు నాకు చాలా దినాల వరకూ తెలీనే తెలీదు — అలాంటి కోరిక నాలోపుట్టిందని,

వొకసారి వొక పెద్దపార్టీలో వాడు నాగురించి అసహ్యంగా ఏవో మాట్లాడుతూండగా విన్నాను. "క్రాక్ వాడు, పెడ్డ సుపీరియారిటీగాడు—" అని నాగురించే అనడం గమనించేను. నా శరీరం నావశం తప్పింది. "స్టుపిడ్ ! నిన్ను చంపేస్తాను —" అని వాడిమీదకు వెళ్ళబోయేను. అంతలో ఏమైందో — కళ్ళు తిరిగినట్టనిపించి, కూచున్న కుర్చీలో అలాగే వొరిగిపోయేను.

నాలో చాలారోజులుగా గూడుకట్టుకున్న ఆ దారుణమైన కోరికగురించి అప్పుడే నాకు తొలిసారిగా తెలిసొచ్చింది.

వొద్దు వొద్దనుకున్నా—ఎన్నిరకాలుగా ఆ ఆచన తప్పించుకుందామనుకున్నా— వూహూ — వీలుపడలేదు. ఆ కోరిక నాలోంచి రూపుమాసిపోలేదు.

పచ్చటి వాడిమెడ చూసినప్పుడల్లా నాచేతివేళ్ళు జిల జిలగా పీకేవి. పయొలిన్ డొక్కులాంటి వాడిఛాతికేసి చూసినప్పుడల్లా నా పిడికిళ్ళు బిగుసుకునేవి.

వాడు స్నేహితుల్తో వున్నప్పుడల్లా — వెనకవాటుగా వెళ్ళి ఏ కాలిగుండో తీసుకుని తలబద్దలు కొట్టెయ్యాలనిపించేది.

ఆ విషపుకళ్ళతో చూస్తూ విషంనవ్వు నవ్వినప్పుడల్లా పట్టరాని ఆవేశంతో వూగిపోయేవాణ్ని.

నేను కళాకారుణ్ణి. ఏదిచేసినా కళాత్మకంగా చేస్తాను. వాడికి బుద్ధిచెప్పినా — వాడిపీక నొక్కేసినా — కళాత్మకంగానే...

అదంతా అలావుండగా నిన్నటికి నిన్న ఆఖరితప్పు చేసేసేడు వాడు. సాయంత్రం ఆరున్నరకి ఐదుమంది స్నేహితులమధ్య నన్ను ఎగతాళిచేసి వెకిలిగా నవ్వేడు — "పేద నువ్వేం ఆకాశంనుంచి వూడిపడ్డావా ?— సైకాలజీ మాట్లాడతావు — బోడిసైకాలజీ!... ఇక్కడున్న వాళ్ళందరికన్నా — నువ్వు దేంట్లో గొప్ప!?" అన్నాడు. అనేసేడు. అంతే !

వాడి మాటలు కాదు. వాడిమాటల నిజానిజాలు కాదు.

తొలిరోజుల్లో వాడు మాట్లాడిన మాటలలో ఈ మాటల్ని పోల్చికూడా చూసుకోనక్కరలేదు. కాని, నిన్నసాయంత్రం వాడి కళ్ళలో విషం—

నల్లటి పచ్చటి ఎర్రెర్ర గీరల విషం !

వూపిరి బిగబట్టి అక్కణ్ణుంచి లేచొచ్చేసేన్నేను. అప్ప

ట్నుంచి దాదాపు ఏడుగంటలసేపు వూరంతా చెడదిరిగేను. వున్మాదిన్నై పోయేను ఎక్కడో పడిపోతాననిపించింది. అతిప్రయత్నంమీద విలదొక్కుకుంటూ గదికొచ్చి పడ్డాను.

గదంతా చిమ్మచీకటి లైటు వెయ్యబోయి ఆగేను. విదానించి చూసేను. కళ్ళు చిట్లించి చూసేను చీకట్లో ఏదో కదిలింది. నిశ్చలంగా చూసేను ! నాగుండె దడదడలాడింది ! ఏమిటది ?— అది — ఆకారం — వొక అకారం !
వాడి ఆకారం !

ఆలోచనకి అవకాశం లేకుండా, వాడినుంచి పలకరింపుకి కూడా వీలులేకుండా వొక్కవుదుటన వాడిమీదికి దూకేను. చీకట్లో మెత్తగా ఆడపిలలా వున్నాడువాడు అందమైన, ఎర్రనైన — బక్కపల్చని వాడిశరీరం — చీకట్లో దొరికింది నాచేతికి — వాడి కళ్ళు — కళ్ళలో విషం నిండినకుళ్ళు — నాకేసి చూస్తున్నాయి — గొంతు దొరకబుచ్చుకున్నాను పీకనొక్కిపట్టేసేను ఇంకా నొక్కేస్తున్నాను గింజుకుంటున్నాడు వాడు వూపిరికై కొట్టుకుంటున్నాడు చీకటో వాడికళ్ళు పచ్చకళ్ళు, విషంకళ్ళు, కుళ్ళు దీనంగా భయంకరంగా విచిత్రంగా దారుణంగా చూస్తున్నాయి నావేపు — పిల్లికళ్ళు — గొర్రెకళ్ళు — గాడిదకళు — విషం కళ్ళు—

శక్తినంతా వుపయోగించి వాడి ఆ అందమైన పీకని నొక్కేను వూహుం — నాశక్తి చాలడంలేదు ... కుడిచేతి పిడికిలి బిగించి ఆఖరుప్రయత్నంగా తీవ్రంగా వాడిగుండెల్లో కుమ్మేను —

అంతే !
జావలాగా శబ్దంలేకుండా — చీకట్లో నీడలాగా నేలమీదికి జారిపడిపోయేడు వాడు.

చీకటి చీకటి చిమ్మచీకటి.
నా గుండెలు నా గొంతులో నా చెవుల్లో కొంటుకుంటున్నాయి...
వొక్కసారిగా బెండులా తేలికైపోయేన్నేను. కళ్ళు తిరిగేయి. రెప్పవిప్పకుండా కళ్ళు మూసుకుని పక్కమీద పడిపోయేను.

బాగా తెల్లారేక, నాగది తలుపెవరో దబదబమని బాదేస్తొంటే మెళకువొచ్చింది —

ఇదరు మిత్రులు ...వొగురుస్తూ చెప్పేరు —
"—మన ఫ్రెండు ... రాత్రి హఠాత్తుగా చచ్చిపోయేట — గుండెపోటు అంటున్నారు డాక్టర్లు ...అదైనా ఎలావొచ్చిందో అర్థం కావడంలేదు—"

వాళ్ళు చెప్తున్నది వాడి మరణం గురించి.
తెల్లబోతూ నాగది నేలమీదకి చూసేను.
ఏమీలేదు ! గదినేలమీద ఏమీలేదు !!
మరిరాత్రి — నేను చంపిన ఆకారం ?—

* * *

చిత్తుగా తాగేసి తూలుతూ బార్‌నుంచి వొస్తున్నాను.
"పాపం ! చూసేవా ! ఫ్రెండ్ చచ్చిపోయిన బాధ భరించలేక తాగుతున్నాడు—" నన్నెరిగిన ఇద్దరో వొకడింకడితో అన్నాడు.
"ఫూల్స్ ! ఫూల్స్ !— అందరూ ఫూల్సే ! వాడు చచ్చిపోలేదు ! చచ్చిపోలేదు ! వాడో ఫూల్ ! బ్యూటిఫుల్‌స్టుపిడ్ ! వాణ్ణి నేనే చంపేసేను ! నేనే చంపేసేను ! గుండెల్లో ఈ పిడికిలితోనే పొడిచి చంపేసేను ! చచ్చిపోలేదు వాడు ! నేనే... చంపేసేను!..."

తాగేసి వున్నాను. ఈ మాటలే అన్నానో, ఈ మాటలే అంటున్నాననుకుని వేరేమాటలే అన్నానో గుర్తులేదు.
"పాపం !... మతిచెడింది...' అనుకుంటూ వాళ్ళు వెళ్ళిపోయేరు.

నేను మాత్రం నవ్వుతూనే వున్నాను.
నవ్వుకుంటూనే వున్నాను ... ...
వికటంగా ... వికటంగా ... ...